
జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

ఖమ్మం

గురువారం 19 సెప్టెంబర్ 2024



## మాకు కోర్ట్ ఆర్డర్ ఉన్నా పట్టా చేశారు



భూ బాధితుల ఆవేదన.

కారేపల్లి , సెప్టెంబర్ 18,ప్రజాజ్యోతి:కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న భూవివాదం కోర్టుకు వెళ్లి అపరిష్కృతంగా ఉండగానే రెవిన్యూ అధికారులు పట్టా చేశారని సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన ఆలోత్ రామచందర్ కుమారులు ఆలోత్ అశోక్, ఆలోత్ కిషోర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి బుధవారం కారేపల్లి లో వారు విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన ఆలోత్ బాలుకు పేరుపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 56/ఉ/2 సర్వే నెంబర్లో ఐదెకరాల భూమి ఉందన్నారు. ఆలోత్ బాలుకు చందర్, రామచందర్, మోహన్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారని, బాలు మృతి చెందిన అనంతరం అతని పేరు మీద ఉన్న ఐదు ఎకరాల భూమి భార్య అయిన జిజా పేరుమీద పట్టా అయిందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న భూవివాదాన్ని పరిష్కరించుకునేందుకు 2021 సంవత్సరంలో కలెక్టర్ కోర్టును - మిగతా8లో

## చిన్నారుల సహాయ స్ఫూర్తి ప్రశంసనీయం



జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నా ఖమ్మం కోసం నేను అనే నినాదంతో విద్యార్థులు 35 వేల విరాళం

చిన్నతనం నుంచే పిల్లలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి

స్కూల్ విద్యార్థుల నుంచి 35 వేల రూపాయల విరాళాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్

వివరాలు8లో

# వరదలను ఎదుర్కొనేందుకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

1077 ను శాశ్వత టోల్ ఫ్రీ నెంబర్ గా ఏర్పాటు

విపత్కర సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరెన్ ఏర్పాటు

సాధారణ పౌరులకు డిజాస్టర్ మేనేజ్మెంట్ పై శిక్షణ అందించి వాలంటీర్లను సిద్ధం చేయాలి

ఖమ్మం నగరంలో ఉన్న కాల్వలను బలోపేతం చేయాలి

మున్నేరు వరద ప్రభావిత ప్రాంతం కరుణగిరిలో పర్యటించి సెయింట్ జోసఫ్ మేజర్ సెమినార్ చర్చ్ హాల్ లో ఇటీవల వచ్చిన వరదపై సంబంధిత యాజమాన్యం తో చర్చించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం టౌన్,సెప్టెంబరు18, ప్రజా జ్యోతి: భవిష్యత్తులో వచ్చే భారీ వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మనమంతా పకడ్బందీగా సన్నద్ధం కావాలని, వరదల సమయంలో పాటించాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసీజర్ ను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం నగరంలోని మున్నేరు నది వరద ప్రభావిత ప్రాంతమైన కరుణగిరిలో పర్యటించి సెయింట్ జోసఫ్ మేజర్ సెమినార్ చర్చ్ హాల్ లో చర్చ్ క్రిస్టియన్ సంబంధిత యాజమాన్యం, అధికారులతో కలిసి ఇటీవల వచ్చిన వరద వల్ల కలిగిన నష్టాలు, భవిష్యత్తులో డిజాస్టర్ మేనేజ్మెంట్ కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కరుణామయ అనాధ ఆశ్రమం, అంధుల, మూగవారికి సంబంధించిన జ్యోతి నివాస్ స్కూల్ ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు ఉన్న పరిస్థితి, నీరు ఏ స్థాయి వరకు వచ్చింది, ప్రాణ సంరక్షణకు తీసుకున్న చర్యలు, గతంలో ఈ స్థాయి వరదలు ఎప్పుడైనా వచ్చాయా, భవిష్యత్తులో వచ్చే వరదల వల్ల కలిగే నష్టాల నివారణ, వరదల సన్నద్ధతకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గంటల వ్యవధిలో కుంభవృష్టి వర్షం పడటం, పరివాహక ప్రాంతాల్లో ఉన్న చెరువులు, ప్రాజెక్టులు అప్పటికే నిండుకుండలా తయారు కావడం, పై నుంచి పెద్ద ఎత్తున వరద రావడం, లకారం చెరువు నిండి ప్రవహించడం మొదలగు కారణాల వల్ల మున్నేరు నదికి గతంలో ఎన్నడూ లేనంతగా భారీగా వరదలు వచ్చాయని, దాదాపు 40 అడుగుల మేర నీటి ప్రవాహం ఉందని, మొదటి అంతస్థు వరకు నీళ్ళు వచ్చాయని తెలిపారు. ఖమ్మం నగరంలో వచ్చిన భారీ వరదల నేపథ్యంలో అందుబాటులో ఉన్న బృందాలు, సిబ్బందితో ప్రజల ప్రాణాలు రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని, వరద సహాయక చర్యలను సైతం వీలైనంత మేర సమర్థవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో సైతం ఇటువంటి వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వరదలు వచ్చినప్పుడు పాటించాల్సిన పద్ధతులపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసీజర్ రూపొందించుకొని దానిని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. కరుణామయ ప్రాంతం పరిసరాలలో వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరెన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. వరదలు వస్తే ఎత్తైన ప్రాంతాలు ఏవి, ఏ భవనంలోకి వెళ్ళాలి, ఇక్కడ ఉన్న అంధుల పాఠశాల విద్యార్థుల తరలింపు బాధ్యత ఎవరు తీసుకోవాలి మొదలగు అంశాలకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని కలెక్టర్ తెలిపారు. వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వరదలు వంటి విపత్కర సమయంలో వినియోగించేందుకు వీలుగా శాశ్వతంగా 1077 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆసక్తిగల సాధారణ పౌరులను ఎంపిక చేసుకుని విపత్కర సమయంలో ప్రజల ప్రాణాలు రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవసరమైన శిక్షణ అందజేసి వాలంటీర్లను సిద్ధం చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. వరదల సమయంలో ప్రజలను రక్షించేందుకు వీలుగా అవసరమైన సామాగ్రి, ఇతర బృందాలను ప్రభుత్వం తరపున సన్నద్ధం చేసుకుంటున్నామని అన్నారు. ఖమ్మం నగర వ్యాప్తంగా ఉన్న కాల్వలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా కొంత మేర వరద ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు త్వరగా కోలుకునే దిశగా అవసరమైన అన్ని రకాల సహాయ చర్యలను ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు. వరదల వల్ల విద్యా సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి సంబంధించిన సర్టిఫికెట్లు త్వరగా అందించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వం అందించే స్వశక్తి రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు, ముద్రా రుణాలు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన రుణాలు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందజేసి ఆర్థికంగా స్థిరపడేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వరద ప్రభావిత ప్రాంతాలైన కరుణామయ అనాధ ఆశ్రమం, జ్యోతి నివాస్ స్కూల్ ను పరిశీలించారు. వరదలు వచ్చినప్పుడు ఆశ్రమంలో పిల్లలను ఎలా తరలించారు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, ఖమ్మం రూరల్ తహసిల్దార్ రాంప్రసాద్, చర్చి రెక్టార్ జయరాజు, ఫైనాన్సు సుధాకర్, సోషల్ సర్వీస్ ప్రతినిధి సురేష్, కార్యదర్శి విజయ్ రీసెర్చర్ చార్లెస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ సర్వేని పరిశీలించిన మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు

బోనకల్,సెప్టెంబర్18,ప్రజా జ్యోతి:మండల పరిధిలో బ్రాహ్మణ పల్లి,రాపల్లి గ్రామాలలో రెండూ లక్షల వరకు రైతు రుణమాఫి కాకుండ రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారి కొండూరి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సర్వే కార్యక్రమంలో మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచందర్ స్వయంగా పాల్గొన్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు లేని రైతులు ఆయా గ్రామాలలో నిర్వహించే సదస్సులలో ధ్రువీకరణ పత్రంతో పాటు,కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్సులు,లోన్ అకౌంట్ జిరాక్సులు, పట్టాదారు పాస్బుక్ నకలు వంటి వివరాలతో మండల వ్యవసాయ అధికారి మరియు వ్యవసాయ విస్తరణ అధికారుల బృందాన్ని సంప్రదిం చాలి అని పేర్కొన్నారు. అర్హత ఉన్నటువంటి రైతులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని వివరించారు. ఈ కార్యక్ర



మంలో వ్యవసాయ విస్తరణ అధికారులు షేక్ హుస్సేన్ సాహెబ్, గోగుల హరికృష్ణ, నాగినేని నాగసాయి రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ని కలిసిన గ్రామ దీపికలు.



సత్తుపల్లి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి.: సత్తుపల్లి నియోజకవర్గం లోని గ్రామ దీపికలు, శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ను బుధవారం కలిశారు. పలు సమస్యలతో కూడిన వినతిని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ దీపికలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి కేవలం 5వేల జీతంతో పనిచేస్తున్నామని, రోజు రోజుకి ఖర్చులు పెరిగిపోవడంతో జీతాలు 10 వేలు వరకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఏమీ లేవు, అని వాటిపై మాకు కచ్చితంగా న్యాయం చేయాలని, గ్రామ దీపికలకు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేస్తే కుటుంబాలకు అండగా ఉంటుందని, వినత పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేటట్టు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మొండ్రు రమణ,హాబీబ్, సరోజిని,చిట్టెమ్మ,లత, సత్తుపల్లి పెనుబల్లి తల్లాడ కల్లూరు వేంసూరు గ్రామ దీపికలు ఉన్నారు.

# మేము సైతం...వరద బాధితులకు అండగా.. అడసర్లపాడు గ్రామం.





## ..బియ్యం, కందిపప్పు,నూనె చీరలు, ఎమ్మెల్యేకు అందజేసిన గ్రామస్తులు.

## ప్రతి ఒక్కరికి పేరు పేరునా అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే.

సత్తుపల్లి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి.: ఆమె పిలుపుతో కదిలిన మర్లపాడు గ్రామం, వరద బాధితులకు చేయూతగా నిలిచిన ఆదర్శ గ్రామంగా, వివరాలు ఇలా... సత్తుపల్లి నియోజకవర్గం లోని వేంసూర్ మండలంలోని అడసర్ల పాడు గ్రామం, సత్తుపల్లి శాసన సభ్యురాలు మున్నేరు బాధితులకు మన ఖమ్మం.. మన సాయం అనే పిలుపుమేరకు, స్వచ్ఛందంగా కదిలిన గ్రామం,ఊరు మొత్తం ఏకంగా కదిలి భారీ మొత్తంలో విరాళాలు సేకరించినారు. మేము సైతం వరద బాధితులకు అండగా ఉండే విధంగా 13.50 క్వింటాళ్ల బియ్యం, 150 నూనె ప్యాకెట్లు, 40 కేజీల కందిపప్పు, 60 చీరలు, వంట సామాగ్రి వంటివి, అడసర్ల పాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి ఎమ్మెల్యేకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం ఒక మంచి పని అని, సర్వం కోల్పోయిన వారికి కొంతగా ఇవి ఆదుకుంటాయని, ఈ సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ ఇంత సహాయ, సహకారాలు, అందించిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, బాధితులకు అండగా ఉన్నందుకు అడసర్లపాడు గ్రామం అందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి,అట్లూరి సత్యనారాయణ రెడ్డి, కాసర సాంబశివరెడ్డి, రేపాని ముత్తారావు, ఒగ్గు కరుణాకర్ రెడ్డి,బండి వెంకటేశ్వర్ రెడ్డి. జెట్టి నల్లమోతు విటల్, జెట్టి రామారావు, ఒగ్గు చిన్నపకేరారెడ్డి, వేల్పుల బుచ్చాలు, నక్క రామకృష్ణ, కోటమర్తి సురేష్, పరిగడుపు వెంకటేశ్వరరావు, రావూరి చిన్న వీరయ్య, వెంకటేశ్వరరావు, ఉప్పతల వెంకటకృష్ణ, మునగాల వెంకటేశ్వరరావు, బండి సుబ్బారెడ్డి, దొడ్డ నర్సారెడ్డి, ఉబ్బల నాగేశ్వరరావు, రాజబోయిన జమలయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# సహాయం అందని వరద బాధితులు





తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 18, ప్రజాజ్యోతి : మండలంలో వరద ముప్పు ప్రాంతాలకు ప్రభుత్వం సాయం అందించింది. దానిలో చొప్పకట్ల పాలెం, కొత్తపాలెం తదితర గ్రామాలలో వరద బాధితులకు నష్టపరిహారం అందించడంలో అన్యాయం జరిగిందని, ఎర్రుపాలెం తహశిల్దార్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాలతో నిరసన చేపట్టి అనంతరం తహసిల్దార్ యం.ఉషా శారద కి వినతి పత్రం అందించారు. వరద బాధితులకి సాయంగా ప్రభుత్వం ఇచ్చిన నిత్యవసర సరుకుల కిట్లు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అందుకు నిదర్శనం చొప్పకట్లపాలెం, కొత్తపాలెం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వం అందించిన నిత్యవసర సరుకుల కిట్లు బాధితులకు అందరికీ అందలేదని తెలియజేశారు. తక్షణమే ఆ గ్రామపంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దయచేసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం మాజీ సర్పంచ్ కత్తి మోహన్ రావు, కత్తి రవికుమార్ గ్రామంలో వరద ముంపునకు గురైన బాధితులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



బోనకల్,సెప్టెంబర్ 18, ప్రజాజ్యోతి: మండల పరిధిలోని ఆల్లపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యా ర్థులకు అదే గ్రామానికీ చెందిన బుంగ బాలరాజు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పదివేల రూపాయలతో పాటు,మేడి ఆదాం వారి కుటుంబ సభ్యులు ఐదువేల రూపాయలతో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్లపాడు గ్రామ సెక్రెటరీ శ్రీనివాసరావు ఆల్లపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుంగ రాములు బోనకల్ మండల బీసీ సెల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందుల పాపారావు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పారా వెంకట మోహన్ రావు తోటకూర వెంకటేశ్వరరావు సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య షేక్ నాగుల మీరా వేల్పుల రమేష్ బుంగ లక్ష్మయ్య మరీదు వెంకన్న హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు 55వేలు వితరణ చేసిన వైద్యులు.



సత్తుపల్లి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి.: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎందరో నిరాశ్రయులుగా ఉన్నా, సర్వం కోల్పోయిన వారికి అండగా ఉండేందుకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి ద యానంద్ మన ఖమ్మం.. మన సాయం అనే నినాదం తోటి సత్తుపల్లి డా క్టర్స్ అసోసియేషన్ ఆమె పిలుపు మేరకు బుధవారం 55 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి తోడ్పా టుగా నిలవడం, ఎంతోకొంత మన తరపున సహాయం అందించటం అ నేది గొప్ప విషయమని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకృష్ణ, వాసవి, కిరణ్ కుమార్, మౌలాలి, రమేష్ చంద్ర, సత్యసాయి,సత్యప్రసాద్, అశోక్ కుమార్, శ్రీహరి, వినీష్ కృష్ణ తదితరులున్నారు.

## బొల్లా కృష్ణ మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే.



సత్తుపల్లి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి. మండల పరిధిలోని రేజర్ల గ్రామానికి చెందిన బొల్లా కృష్ణ బుధవారం మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. మృతి గల కారణాలు తెలుసుకొని కుటుంబానికి సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట భీమిరెడ్డి సుబ్బారెడ్డి, జక్కుల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలి



### నాలుగు డిఏలను వెంటనే ప్రకటించాలి

### జూలై 2023 నుండి పి ఆర్ సి వర్తింపచేయాలి

### సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి.టిఎస్ యుటిఎఫ్

కూసుమంచి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి : తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగులో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని , జూలై-2023 నుండి తెలంగాణ రెండవ పిఆర్సి ని అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలను బుధవారం సందర్శించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన ఫెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినదని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని తెలియజేసిందని కావున మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను వెంటనే అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ కు బదులుగా యుపిఎస్ తీసుకురావటం మసిపూసి మారేడు కాయ చేయడమేనని సిపిఎస్ అంతమయ్యే వరకు యుటిఎఫ్ పోరాడుతుందని , ఓపిఎస్ కొరకు అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. పెండింగ్లో ఉన్న ఇతర సమస్యలన్నింటినీ వేగంగా పరిష్కరించాలని, విద్యా కమిషన్ ను ఏర్పాటు చేసి, విద్యారంగంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో యుటియఫ్ నాయకులు మండవ. నర్సయ్య సుభాషిణి, యస్.యస్.రాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సమస్యలు పరిష్కరించండి

### చైర్మన్ కలిసిన ఎఐసిసి నాయకులు

### ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షులు ఏనోష్ కుమార్



కల్లూరు సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి): ఎన్నో ఏళ్లుగా పరిష్కారం నకు నోచుకోని క్రైస్తవ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కు అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రెవ ఎనోష్ కుమార్ ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.బుధవారం టీజిఎం ప్రేయర్ టవర్ లో రాష్ట్ర అధ్యక్షులు ఎనోష్ కుమార్ మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ హైదరాబాద్ నందు వారి కార్యాలయంలో కలిసి సమాజంలో ప్రజలను సత్యమార్గము వైపు నడిపించుటకు సత్యాన్ని ప్రకటించే నిరుపేద పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నూతనంగా నిర్మించబోయే మందిరాలకు పర్మిషన్ ఇప్పించాలని కోరారు.ఒక మనిషి చనిపోతే వారి అంత్యక్రియలు నిర్వహించడానికి క్రైస్తవులకు స్థలాలు లేవని వారికి స్మశాన వాటికలు కొరకు స్థలం ఇప్పించాలని కోరారు.క్రైస్తవ సమాజానికి క్రిస్టియన్ భవన్ నిర్మించాలని,క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ లోన్స్ ఇప్పించాలని,నూతన మందిరాల నిర్మాణం కొరకు నిధులు ఇవ్వాలని, క్రైస్తవులకు బిసి సి సర్టిఫికెట్ ఇవ్వాలని,అర్హత కలిగిన పాస్టర్లకు మ్యారేజ్ లైసెన్స్ ఇవ్వాలని వారు కోరారు.ఇట్టి విషయాలపై స్పందించిన తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ కొద్దికాలంలోనే సమస్యలకు పరిష్కారం అయ్యే దిశగా ప్రభుత్వము తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ కు క్రైస్తవ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎఐసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాసి బాలరాజు,మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు,మండల అధ్యక్షులు తేళ్ల ఎబినేజర్,గౌరవ సలహాదారులు తేళ్లూరి సంజీవరావు,ఉపాధ్యక్షులు దయాకర్,ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి,నియోజకవర్గ కన్వీనర్ కెనడిరాజు,ఆయా మండలాల అధ్యక్షులు ఓనేసిము, మేషెక్,అద్యక్షులు జయరాజు పోల్గొన్నారు.

# గంగ ఒడికి గణపయ్య







### అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన కార్యదర్శి శ్రీనివాస రావు

### గణపయ్యకు ఘనంగా వీడ్కోలు

కల్లూరు సెప్టెంబర్18(ప్రజా జ్యోతి): నవరాత్రులు విశేష పూజలు అందుకున్న మట్టి గణపయ్యను గడపగడపకు పూజలు చేస్తూ మేళ తాళాలతో రంగులతో భక్తుల ఆనందోత్సాహాలతో గంగ ఒడికి చేర్చారు.బుధవారం మండలపరిధిలోని రఘునాథ బంజర పడమటి బజార్ లో గణేష్ ఉత్సవకమిటీ ఏర్పాటు చేసిన గణనాధున్ని నవరాత్రులు భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.చివరి రోజున కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి స్వయంగా మట్టి గణపతిని తయారు చేయటం అభినందనీయమని ఇలా ప్రతి సంవత్సరం సొంతగా గ్రామంలో తయారు చేసుకోవడం మండలంలోనే గొప్ప విషయమని వారన్నారు.గణనాథుని దీవెనలు గ్రామ ప్రజలందరిపై మెండుగా ఉండాలని మీ కోరికలు నెరవేరాలని కోరారు.విఘ్నేశ్వరుని ఊరేగింపు జరిగేటప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో తగు జాగ్రత్తలతో నిమజ్జనం చేయాలని కమిటీకి తెలియజేశారు.మట్టి వినాయకుని తయారుచేసిన కుక్కా శ్రీనివాసరావు,అరవింద్ లను కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.గణపతి నవరాత్రుల్లో పూజించబడిన లడ్డును బండి సూర్యనారాయణ వేలం పాటలో 8 వేలకు దక్కించుకున్నారు.కమిటీ సభ్యులు లడ్డు ను వారికి అప్పగించారు.ఈ కార్యక్రమంలో పడమట బజార్ కమిటీ సభ్యులు,మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

సత్తుపల్లి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి. నేడు విద్యుత్ కొత్త ట్రాన్స్ఫార్మర్ల పని నిమిత్తం సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఏ ఈ శరత్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్ లో ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 04:00 గంటల వరకు నూతన ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుపై, సప్లై కి అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించగలరని కోరారు.

# అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాలి..

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ
## పోషక లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి.. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్
## అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్ష
## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్




ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 18,: ప్రజా జ్యోతి: అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, మహిళా, స్త్రీ సంక్షేమ శాఖలో అమలవుతున్న వివిధ పథకాలపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న ఆహార పదార్థాలు, పోషకాహార లోపం, అతి తీవ్ర పోషకాహార లోపం గల పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకొని పోషకాహార లోపం పిల్లలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చేయవలసిన ప్రక్రియ గురించి సూపర్వైజర్లకు సూచనలు చేశారు. ప్రతి సూపర్వైజర్ ప్రతి నెల 20 అంగన్వాడి కేంద్రాలు సందర్శించాలని, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై అంగన్వాడీ టీచర్ కు ఎప్పటికప్పుడు మార్గ నిర్దేశం చేయాలని, అక్కడ జరిగే కార్యక్రమాల ఫోటోలు గ్రూపులో పోస్ట్ చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. సమీక్ష సమావేశాలు ప్రతి నెల మొదటి వారంలోనూ చివరి వారంలోనూ నిర్వహిస్తామని, ఇట్టి సమావేశాలకు పోషకాహారం లోపంతో ఉన్న పిల్లల పూర్తి నివేదిక, పోషకాహార లోపానికి కారణాల పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజర అవ్వాలని సూపర్వైజర్లకు, సిడిపిఓలకు అదనపు కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అంగన్వాడీ కేంద్రాల తనిఖీలు చేపట్టనున్నట్లు, అంగన్వాడీ కేంద్ర ఆయా, టీచర్లు అంగన్వాడీ కేంద్ర పని గంటలు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు కేంద్రంలో వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న అంగన్వాడీ కేంద్రాల నష్టం పై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సీడీపీ వోలు, ఏసీడీపీవోలు, సూపర్వైజర్లు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి విష్ణు చందన, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పన కు సహకరించాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ
## గ్రామ పంచాయతీ ఎన్నికల ఎలక్టోరోల్ ప్రచురణ షెడ్యూల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్
## ఈ నెల 28న గ్రామ పంచాయతీల ఫోటో ఎలక్టోరోల్ రోల్స్ తుది పబ్లికేషన్



ఖమ్మం, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి: గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పన పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల నేపథ్యంలో, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 13న గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా లో గల అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను సెప్టెంబర్ 21 లోపు సంబంధిత మండలాల ఎంపిడివో లకు లిఖితపూర్వకంగా సమర్పించాలని, సెప్టెంబర్ 26 లోపు అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబర్ 28న తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ ఓటరు జాబితాలో ఉన్న అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదుకు సెప్టెంబర్ 21 వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఒక కుటుంబం లోని సభ్యులందరికి ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సంపూర్ణ సహకారం అందజేయాలని, ఓటర్ జాబితా రూపకల్పన పై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిపివో ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి బుర్ర ఉపేంద్ర, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధులు ఎన్. వీరబాబు, ఎస్. నవీన్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్, సీపీఐ పార్టీ ప్రతినిధి తాటి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) ఆవుల అశోక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిందీ ఉపాధ్యాయుడు గౌసుద్దీన్ కు ఘన సన్మానం



బోనకల్, సెప్టెంబర్18, ప్రజా జ్యోతి: మండల పరిధిలోని రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ భాషా దినోత్సవం పురస్కరించుకొని హిందీ ఉపాధ్యాయులు ఎండి గౌసుద్దీన్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామాల పుల్లయ్య శాలువతో సత్కరించి బహుమతిని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య మాట్లాడుతూ హిందీ యొక్క ప్రాముఖ్యతను గొప్పతనాన్ని వివరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇన్స్టంట్ టాయిలెట్స్ ప్రారంభం





## డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 18, ప్రజాజ్యోతి: ఖమ్మం నగరంలో స్థానిక 37వ డివిజన్ లోని బాలికల పాఠశాలలో విద్యార్థులు సౌకర్యార్థం సుమారు అయిదు లక్షల యాభై వేల రూపాయలతో మూడు ఇన్స్టంట్ మరుగు దొడ్లను నేస్లే ఇండియా లిమిటెడ్ ఆధ్వర్య ంలో సిఎస్ఆర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా , డిఇఓ సోమశేఖర్ శర్మ , నేస్లే కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ వసీం అహ్మద్ , నేస్లే ఇండియా మేనేజర్ జాకీర్ హుస్సేన్ , ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు వరలక్ష్మి , శశికళ , పారిజాత తదితరులు పాల్గొన్నారు .

# వికలాంగులకు సరుకుల మున్నేరు వరద బాధితులకు కిట్లను పంపిణీ చేసిన ఎన్నారై

ఖమ్మం, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి: ఖమ్మం మున్నేరు వరదల్లో సర్వం కోల్పోయిన %ఖ%నిరాశ్రయుల కుటుంబాలకు చెందిన మానసిక వికలాంగుల పిల్లలకు నిత్యావసర సరుకుల 100 కిట్లను సీనియర్ ఎన్నారై ఆచార్య ముత్యాల రామయ్య బుధవారం పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలి లో ఉన్న థెరిస్సా మానసిక వికలాంగులకు నిత్యవసర సరుకులతో పాటుగా రగ్గులు ఇతర వస్తు సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ గత ఐదు రోజులుగా మున్నేరు వరద బాధితులను గుర్తించి తమ వంతు సాయంగా ఇప్పటి వరకు 5 వందల నిత్యావసర కిట్లను పంపిణీ చేసినట్లుగా తెలిపారు. ఇక్కడే పుట్టి పెరిగిన తనకు నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడం సంతోషం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విమలదేవి, ఎన్నారై వనజ కుమారి, నాగేశ్వరరావు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం ప్రారంభించిన ఇమ్మడి.



కారేపల్లి, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి : విఘ్నేశ్వరుడు అందర్నీ చల్లగా చూడాలి అని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు అన్నారు. సింగరేణి మండలం మాణిక్యారం గుడి తండా శివాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మంగళవారం రాత్రి అన్నదానాన్ని ఇమ్మడి తిరుపతిరావు ప్రారంభించారు. ముందుగా లంబోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని, ఆ మహా ప్రసాదం సేవించడం అంటే ఎంతో పుణ్యం చేసుకున్నట్లు అర్థం అని అన్నారు. కార్యక్రమంలో మల్లెల నాగేశ్వరరావు, ఈసాల నాగేశ్వరరావు, నూనావత్ గన్యా, పవన్, భూక్యా రాంబాబు, భజ్యాతండా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు నష్టపరహారం ఇవ్వండి.

## తాసిల్దార్ కు వినతి చేసిన వరద బాధితులు.



కూసుమంచి సెప్టెంబర్18 ప్రజా జ్యోతి: ఈనెల మొదటి వారంలో వచ్చిన భారీ వర్షాలకు పాలేరు జలాశయానికి భారీగా వరద రావడంతో మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో వందల సంఖ్యలో ఇండ్లు నీటి మునిగాయి. దీంతో ఇండ్లలోని నిత్యవసర వస్తువులతో పాటు ఎలక్ట్రానిక్స్ వస్తువులు కూడా నీటి పాలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం వరదల్లో మునిగిన ఇండ్లకు వారికి ఆర్థిక సహాయంగా రూ 16,500 ఆర్థిక సహాయం అందించింది. నాయక గూడెం గ్రామంలో అర్హులకు నష్టపరిహారం అందలేదని, గ్రామంలో అనార్హులైన కొద్దిమందికి నష్ట పరిహారం వచ్చినదని,నిజమైన అర్హులకు మాత్రం నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయానికి వచ్చి తాసిల్దార్ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తాసిల్దార్ డి.కరుణ శ్రీ కి వరద బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ మాట్లా డుతూనాయకన్ గూడెం గ్రామానికి అధికారులను పంపి సర్వే చేయించి అర్హులైన ప్రతివారికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఇంకా సుమారు అర్హులైన సుమారు 25 కుటుంబాలకు వరద సహాయం అందలేదని వెంటనే అధికారులు స్పందించి తక్షణమే ఎంక్వయిరీ చేయించి అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి కర్ణబాబు, సిపిఎం సీనియర్ నాయకులు కంచర్ల జగన్మోహన్ రెడ్డి, సింగం కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు సమ్మయ్య సేవలు చిరస్మరణీయం





## టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ

## సమ్మయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

ఖమ్మం, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి: జర్నలిస్టు అబ్బుగోని సమ్మయ్య సేవలు చిరస్మరణీయమని, జర్నలిస్టుల సంక్షేమ కోసం తన వంతు బాధ్యతగా పని చేశారని, సమ్మయ్య చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ పేర్కొన్నారు. వార్త స్టాఫ్ రిపోర్టర్ అబ్బు గోని సమ్మయ్య (48) అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందారు. ఖమ్మం ముస్తఫా నగర్ లోని సమ్మయ్య ఇంటి వద్ద జరిగిన పెద్దకర్మ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు వార్త రీజినల్ మేనేజర్ జె. వెంకటరత్నం సూచన మేరకు ఖమ్మం వార్త బ్యూరో ఆకుతోట ఆదినారాయణ సారధ్యం లో పలువురు జర్నలిస్టులు కొంత ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా సమ్మయ్య చిత్రపటం వద్ద ఘన నివాళులు అర్పించి సమ్మయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ , వార్త ప్రత్యేక ప్రతినిధి మోహినిద్దీన్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, జర్నలిస్టులు టీవిఎస్ చక్రవర్తి, కొర కొప్పుల రాంబాబు, పిన్ని సత్యనారాయణ, కమతం శ్రీను, సాయిరాం, జీవన్ రెడ్డి, పులి శ్రీను, దిశ ఉపేందర్, మూర్తి, మురళి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దరఖాస్తుల కౌంటర్లు పరిశీలించిన కమిషనర్





ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి: ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయం నందు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. వేటి వేటికి దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఏ సమయం నుంచి ఏ సమయం వరకు ఉంటున్నారు అనేది అక్కడ కౌంటర్లో పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. కౌంటర్ దగ్గరకు వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ మీరు ఎక్కడి నుంచి వచ్చారు వారి సమస్యలేంటి దేనికి అప్లై చేస్తున్నారు అనే విషయం అడిగి తెలుసుకొ న్నారు . వచ్చిన వారందరి ఇబ్బంది కలగకుండా ఎక్కువగా కౌంటర్లు పెట్టి దరఖాస్తులు స్వీకరించాలని సిబ్బందితో చెప్పారు. అంతే వరదల వల్ల నీట మునిగినటు వంటి ప్రాంతాల ప్రజల కీ సహాయం అందనటు వంటి వారు దరఖాస్తులు ఇవ్వడం కోసం ఏర్పాటుచేసిన కౌంటింగ్ కూడా కమిషనర్ పరిశీలించారు. సర్వే రోజు ఇంటికాడ లేకుండా ఇవ్వని వారికోసం , దరఖాస్తులు ఇచ్చి పరిహారం అందని వారి కోసం ప్రత్యేకంగా హెల్ప్ డిస్క్ ఏర్పాటు చేశారు. ఆ హెల్ప్ డెస్కులను కమిషనర్ పరిశీలించి ఫామ్స్ ఎలా తీసుకుంటున్నారు అనేది చూడడం జరిగినది , కొంతమంది ప్రజలతో మాట్లాడుతూ మీరు ఏ ప్రదేశం నుంచి వచ్చారు మీ గృహాలు ఎంతవరకు మునిగాయి అనీ తెలుసుకుంటూ ప్రజలతో మాట్లాడారు.

# విద్యార్థులకు భాగం ఫౌండేషన్ చేయూత



చింతకాని, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి:భాగం ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ పాఠశాల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చారు. చింతకాని మండలం, చిన్న మండవ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం బెల్టులు, టైలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 9.5 గ్రేడ్ పాయింట్స్ సాధించిన ప్రతి విద్యార్థికి 10 వేలు ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తామన్నారు... పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రత్యేక తరగతులలో అందించే అల్పాహారానికి ఆర్థిక చేయూత ఇస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అమెరికా లో నేను మంచి ఉద్యోగం చేస్తున్నానని , చదువుకుంటే ఏదైనా సాధించగలం అనే సంకల్పం మీలో ఉండాలని విద్యార్థులకు సూచించారు.మీరు కూడా ఇదే పాఠశాల నుండి మండల స్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిస్తే మరో 10 వేలు ప్రోత్సాహక నగదు విద్యార్థులకు అందజేస్తామన్నారు. విద్యపై మక్కువతో రాణించే విద్యార్థులకు భాగం ఫౌండేషన్ చేయూతనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కాశీమాల లక్ష్మి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెట్టి రాంబాబు ,ఉపాధ్యాయులు పుల్లారావు , ఖాన్, నాగేశ్వరావు, రత్న కుమారి ,కుసుమవతి గారు పూర్వ విద్యార్థులు గుండ్ల రాంబాబు, ఆత్మకూరి రవి కుమార్, పర్చగాని సతీశ్, తదితరులు పాల్గొన్నారు...

# జూనియర్ కళాశాలను సందర్శించిన డిఐఈఓ.



## పరిసరాల, రికార్డుల పరిశీలన.

## అకాడమిక్ అంశాలపై పలుసూచనలు.

కారేపల్లి,సెప్టెంబర్ 18,ప్రజాజ్యోతి: సింగరేణి మండల కేంద్రం కారేపల్లిలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రవిబాబు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.కళాశాల తరగతి గదులను పరిశీలించిన అనంతరం అధ్యాపకులకు అకాడమిక్ కు సంబంధించినటువంటి అంశాలపై పలు సూచనలు చేసారు.యూత్ టూరిజం క్లబ్ కళాశాల స్థాయిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం పలు రకాల రికార్డ్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపక, అధ్యాపకేతర బంధం తదితరులు పాల్గొన్నారు.

# మా ఖమ్మం సహాయార్థం బత్తులపల్లి గ్రామపంచాయతీ



కల్లూరు సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి):మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామపంచాయతీ లో ఖమ్మం మున్నేరు వరద బాధితులకు మేము సైతం అంటూ బత్తులపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్వయంగా 6 క్వింటాల 25 కేజీలు బియ్యం స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కి పంపించడం జరిగింది.బత్తులపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాతలు అక్కిరెడ్డి యేసు రెడ్డి,పొదిలి వెంకటేశ్వర్లు,జంగా చిన్న పిచ్చిరెడ్డి,శీలం శ్రీనివాస్ రెడ్డి,కత్తి మాధవ రెడ్డి వేల్పుల నానయ్య, లక్ష్మీ నరసింహ రైస్ మిల్,కత్తి కృష్ణారెడ్డి,కోర్ర నరసింహారావు, కప్పల బంధం తల్లపురెడ్డి పుల్లారెడ్డి లు కలసి నా ఖమ్మం సహాయ నిధికి బియ్యం పంపించడం జరిగింది.

# ధరలను నియంత్రించండి

## -మహిళా సమాఖ్య డిమాండ్




ఖమ్మం టౌన్, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో లతాదేవి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేద, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ప్రజల ఆదాయాలు కోల్పోయి ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవుతుంటే పాలకులు మాత్రం ఇవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ధరలను పెంచి ఇబ్బందులు పెడుతున్నారని లతాదేవి తెలిపారు. మోడీ ప్రభుత్వం వంట నూనెల ధరలను పెంచడం అమానుషమని దీనిని మహిళా సమాఖ్య తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆమె తెలిపారు. ధరలను నియంత్రించని పక్షంలో ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్యనాయకులు తాటి నిర్మల, సిహెచ్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు రూ.4వేల పెన్షన్ ఇవ్వాలి.






## ఎన్నికల హామీలను సత్వరం నెరవేర్చాలి

## వ్య.కా.స ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఖమ్మం, సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి: వ్యవసాయ కూలీలకు నెలకు రూ.4వేల పెన్షన్ అందించేవిధంగా తక్షణం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎన్నికల హామీలను సత్వరం నెరవేర్చాలని వ్యవసాయ కూలీలకు నెలకు నాలుగు వేల రూపాయల పెన్షన్ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద మహిళలకు ఏడాదికి రూ.12వేలు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2,500 చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందనిఆరోపించారు. తక్షణమే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ తక్షణ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.500 గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి అసంపూర్తిగా అమలవుతున్నాయని చాలా కుటుంబాలు రకరకాల కారణాలతో ఈ పథకాల ద్వారా లబ్ది పొందలేకపోతున్నారని తక్షణం అధికారులు సర్వే చేసి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని నేషనల్ మొబైల్ మానిటరింగ్ పద్ధతిని రద్దు చేయడంతో పాటు ఖాళీగాఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని వెంకటేశ్వర రావు డిమాండ్ చేశారు. సీనియర్ మెట్లను గుర్తించి అర్హత ఉన్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని రోజు కూలీ పెంపుదల కొరకు షెడ్యూల్ మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, నాయకులు పగిళ్ల వీరభద్రం, బానోత్ రామూర్తి పిట్టల రాంబాబు, మేళ్లచెరువు వీరబాబు, కాసినబోయిన అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలి

## టీఎస్ యుటిఎఫ్,జేఏసీ ల సంయుక్త ఆధ్వర్యంలో దశలవారి పోరాటం



బోనకల్,సెప్టెంబర్18, ప్రజాజ్యోతి: గురుకులాల్లో ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన సమయంలో ప్లకార్డులతో నిరసన సోషల్ వెల్ఫేర్ బీసీ గురుకుల పాఠశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ అన్ని గురుకుల జేఏసీ లో సంయుక్త ఆధ్వర్యంలో దశలవారి పోరాటంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల బీసీ వెల్ఫేర్ పాఠశాల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో డిమాండ్స్ తో కూడిన ప్లకార్డ్స్ తో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానంగా గురుకుల సమయపాలనను మార్చాలని,ఇప్పుడున్న రేట్లు కనుగణంగా విద్యార్థులు యొక్క మెస్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.పక్కా బిల్డింగులను . నిర్మించాలని ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా వేతనాలు చెల్లించాలని అన్నారు.బిసి గురుకులంలో డిప్యూటీ వార్డ్ ను నియమించాలని,రాత్రి వేళల్లో కేర్ టేకర్స్ ను నియమించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురుకుల జేఏసీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించినట్లయితే ఈనెల 22, 23 తారీకుల్లో కలెక్టర్లకు,శాసనసభ్యులకు మెమోరాండమ్ ఇవ్వటం జరుగుతుందని, అప్పటికి పరిష్కరించని యెడల ఈ నెల 28వ తారీఖున హైదరాబాదులో మహాధర్నా జరుగుతుందని తెలియజేశారుకావున ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు సదాబాబు,టీఎస్ టిఎఫ్ మండల నాయకులు పి గోపాలరావు,సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ పివి పద్మావతి, ఎండి షీలా బేగం, ఎస్.కె పర్జానా,డి. శ్రీదేవి, డి మాధురి బిందు మహాలక్ష్మి నాగమణి ,స్వరూప ,సత్యవతి, వాణి రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ ఉపాధ్యాయులు పరశురాం, భద్రు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో పాడి గేదే మృతి



బోనకల్,సెప్టెంబర్18, ప్రజా జ్యోతి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుడిదే నాగేశ్వరరావుకు చెందిన పాడి గేదే విద్యుత్ షాక్ తో బుధవారం మృతిచెందింది. వివరాల్లో వెళితే బ్రాహ్మణపల్లి బస్టాండ్ సెంటర్కు సమీపంలోని అరటితోటలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏటువంటి రక్షణ లేకపోవడంతో సమీపంలో మేత మేస్తున్న పాడి గేదేకు ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి పెద్ద శబ్దం సంబవించింది. పాడిగేడే అక్కడిక్కడే మృతి చెందింది. పాడిగేదే సుమారు రూ.90 వేలు విలువ చేస్తుందని నాగేశ్వరరావు కుటుంబీకులు తెలిపారు. నిత్యం పదుల సంఖ్యలో కూలీలు ఈ ట్రాన్స్ఫార్మర్ వైపుగా రాకపోకలు చేస్తుంటారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు రక్షణ వలయం ఏర్పాటు ఏటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి






ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఇంటిగ్రేటెడ్ వెజ్ %ు% నాన్వెజ్ మార్కెట్లో స్వచ్ఛత హి సేవ 2024 - 25 కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ మార్కెట్ కమిటీ మెంబర్స్ %ు% ఈవో పారిశుద్ధ్య సిబ్బందితో తో కలిసి చెత్తను శుభ్రపరచడం జరిగినది , శాంతినగర్ స్కూల్ యందు స్వచ్ఛత హి సేవ 2024 - 25 కార్యక్రమంలో భాగంగా పిల్లలతో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ చెత్తను తడ చెత్త పొడి చెత్త వేరుచేసి మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నేను సంవత్సరానికి 100 గంటలు లేదా వారంలో రెండు గంటలకు పనిచేస్తానని మా వీధులు చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటామని పక్కన వారికి కూడా తెలియ జేస్తామని నా దేశ పరిశుభ్రత నా వంతు సహాయంగా దేశంలో ముందుకు తీసుకెళ్తూ సహాయ పడతానని చెత్తను కాలువలో కానీ వీధుల్లో రోడ్లపై కానీ వేయనని చుట్టుపక్కల వారికి కూడా తెలియజేస్తానని వారిచేత ప్రతిజ్ఞ చేయించడం జరిగినది స్కూల్ పిల్లలతో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన పోటీలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభావంతులకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేయడం జరిగినది అసిస్టెంట్ కమిషనర్ సానిటరీ సూపర్వైజర్ సానిటరీ ఇన్స్పెక్టర్స్ జవాన్ పారిశుద్ధ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది .

# బిజేపి తీరు అప్రజాస్వామికం



## రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య
## డిసిసి అధ్యక్షులు దుర్గా ప్రసాద్
## కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

ఖమ్మం, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్రనేత పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పై బిజెపి అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా బిజెపి శివసేన నాయకులు చేస్తున్న ప్రకటనలు హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పాత బస్ స్టాండ్ సర్కిల్ నందు బిజెపి నాయకుల దిష్టి బొమ్మ ను దహనం చేయడం జరిగిందని అన్నారు. ఒక ప్రజాస్వామిక వాదిగా ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పై బిజెపి బెదిరింపులకు పాల్పడుతుందని అని అన్నారు. శివ సేన ఎంపి ఒకరు రాహుల్ గాంధీ నాలుక కోస్తే 11లక్షల రూపాయలు బహుమానం ఇస్తానని ప్రకటించగా బిజెపికి చెందిన మాజీ ఎమ్మెల్యే తన్విధర్ సింగ్ రాహుల్ గాంధీ నువు బయటికి వస్తె చంపేస్తామని మీ నానమ్మ ఇందిర గాంధీ కి పట్టిన గతే నీకు పడుతుందని బహిరం గంగా ప్రకటించారని అన్నారు. ఇంత బహిర్గత వ్యాఖ్యలు చేసినా ప్రధాని మోడీ కానీ హోం శాఖ మంత్రి అమిత్ షా గాని ఈ విషయం ఒలో కనీసం స్పందించకపోవడం బిజెపి హింసా రాజకీయల గుట్టు రట్టు అయిందని విమర్శించారు. బిజెపి తీరు మారక పోతే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రాహుల్ గాంధీ కి అండగా ఉండి బిజెపి అహింసా, అప్రజాస్వామిక విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. మోడీకి, అమిత్ షా కు రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే వ్యవస్థలను సజావుగా నడపాలని రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలను చేసిన నాయకులపై చర్యలు తీసుకొని పార్టీ నుండి బహిస్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు అనంతరం మాజీ ఎమ్మెల్సీ టీపీసీసీ ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి కి చెందిన కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టు రాహుల్ గాంధీ అతిపెద్ద టెర్రరిస్టు అని అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రజాస్వామ్య వాదిగా ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాహుల్ గాంధీ వెనుకాడరని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా మహిళా, మైనారిటీ,సేవాదళ్ అధ్యక్షులు దొబ్బల సౌజన్య,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్ గౌడ్,సయ్యద్ గౌస్,కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, నగర కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన భారతిచంద్రం, ముదుముంతల గంగరాజు యాదవ్,షేక్ అబ్బాస్ బేగ్, బాణాల లక్ష్మణ్, అనిల్,ఏలూరి అనిల్, దొడ్డా ప్రవీణ్, జహీర్ భాయ్, జాని, గడ్డికొప్పుల ఆనంద్ రావు, గజ్జి సూర్యనారాయణ, కమతం రామక్రిష్ణ, బడేమియా, నూకారపు వేంకటేశ్వరరావు, గద్దం వెంకటయ్య, మందపల్లి నాగమణి, ప్రతిభారెడ్డి, ఫరీద్ ఖాద్రి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# "మన ఖమ్మం కోసం మనం" ఎమ్మెల్యే పిలుపుకు స్పందన.



సత్తుపల్లి రూరల్, సెప్టెంబర్ 18: (ప్రజా జ్యోతి) "మన ఖమ్మం కోసం మనం" వరద బాధితుల సహాయార్థం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పిలుపుకు విశేష స్పందన ఏర్పడింది. ప్రతి గ్రామం నుండి తోచిన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే సహాయనిధికి అందిస్తున్నారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని తుమ్మూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు 62000 ఆర్థిక సహాయాన్ని తమ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతికి అందజేశారు. బాధిత కుటుంబాలకు సహాయాన్ని అందిస్తున్నందుకు తుమ్మూరు గ్రామ ప్రజలను ఎమ్మెల్యే అభినందించారు.

# విద్యార్థులకు భాగం ఫౌండేషన్ చేయూత





బోనకల్,సెప్టెంబర్18,ప్రజా జ్యోతి:భాగం ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ పాఠశాల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చారు. చింతకాని మండలం, చిన్న మండవ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం బెల్టులు, టైలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 9.5 గ్రేడ్ పాయింట్స్ సాధించిన ప్రతి విద్యార్థికి 10 వేలు ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తామన్నారు. పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రత్యేక తరగతులలో అందించే అల్పాహారానికి ఆర్థిక చేయూతని ఇస్తామన్నారు. ఇదే పాఠశాల నుండి మండల స్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిస్తే మరో 10 వేలు ప్రోత్సాహక నగదు విద్యార్థులకు అందజేస్తామన్నారు. విద్యపై మక్కువతో రాణించే విద్యార్థులకు భాగం ఫౌండేషన్ చేయూతనిస్తుందని పేర్కొన్నారు. ఈ రోజు కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాకు కోర్ట్ ఆర్డర్ ఉన్నా పట్టా చేశారు

-మొదటిపేజీ తరువాయి

ఆశ్రయించామన్నారు. కోర్టు ఆధారాలు పరిశీలించిన మీదట ఆగస్టు ఆరవ తేదీ 2022వ సంవత్సరంలో ఎటువంటి బాధలాయింపు జరగవద్దని కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సంబంధిత ఉత్తర్వులు తహశీల్దార్ కార్యాలయానికి అందాయన్నారు. మా నాయనమ్మ అయిన జిజా కుటుంబ పోషణ కోసం మా నాన్న రామచందర్ ప్రతి నెల వెయ్యి రూపాయలు ఇస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మా బాబాయి అయిన మోహన్ వద్ద ఉన్న మా నాయనమ్మ జిజా పేరుతో 14 మార్చి 2024వ తేదీన ఇతర కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే మా బాబాయి మోహన్ స్థిరాస్తి బహుమాన దస్తావేజును రాసి జిజా పేరు మీద ఉన్న ఐదు ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలను పట్టా చేయించుకున్నారన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నా రెవెన్యూ అధికారులు పట్టా చేయడం పట్ల తమకు అనుమానాలు ఉన్నాయని. ఈ పట్టాను రద్దుచేసి తమ భూమిని తమకు అప్పగించాలని కోరారు.

## పేకాటరాయుళ్ళు అరెస్ట్

### 12 మందిని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ షాకీర్

**కల్లూరు సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి):** రఘునాథ గూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసిన ఎస్ఐ షాకీర్.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం రఘునాథ గూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 12 మంది వ్యక్తులను సమాచారం మేరకు అదుపులోకి తీసుకొన్నట్లు వారు తెలిపారు.వారిలో రఘునాథ గూడెం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు,లోకవరం గ్రామానికి చెందిన ముగ్గురు, పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన ఇద్దరు,ఆంధ్రా రాష్ట్రం అక్కపాలెం గ్రామానికి చెందిన ఒకరినిగా గుర్తించారు.వారి వద్ద నుండి మూడు మోటార్ సైకిళ్ళు,102 పేక ముక్కలు,రూ. 2750 నగదు సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై షాకీర్ తెలిపారు.

# చిన్నారుల సహాయ స్ఫూర్తి ప్రశంసనీయం



**ఖమ్మం, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి:** చిన్నతనం నుంచి ఇతరులకు సహాయం చేయాలనే మంచి హృదయంతో ఖమ్మం వరద బాధితుల కోసం చిన్నారులు చూపించిన సహాయ స్ఫూర్తి ప్రశంసనీయమనిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. వరద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు నా ఖమ్మం కోసం నేను అనే నినాదంతో కొణిజర్లకు చెందిన సమతా సూపర్ జెమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాద్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు సేకరించిన 35 వేల రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించిన విద్యార్థుల సహృదయాలను ప్రశంసించారు. వరద బాధితులకు మనం అందించే సహాయం డబ్బు, వస్తువు రూపంలో వారికి సహాయ పడటమే కాకుండా విపత్కర సమయంలో సమాజంలోని ప్రజలంతా కలిసి మనకు సహాయం చేస్తున్నారనే ఆత్మస్థైర్యం బాధితుల్లో పెరుగుతుందని, వరద బాధితుల సహాయార్థంపై స్కూల్ విద్యార్థులు ఆలోచించడం మంచి విషయమని కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. చిన్నతనం నుంచే సమాజం పట్ల అవగాహన కల్పిస్తూ, పిల్లలు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు. ఇతరు లకు సహాయం చేయాలనే ఉద్దేశం చిన్నప్పటి నుంచే పిల్లలలో మనం నాటాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు కొణతం ఉమాశంకర్, ఉపాధ్యాయులు కంచేటి స్రవంతి, నంజాల సాయి, విద్యార్థినీ, విద్యార్థులు, పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రత్యేక అధికారులు కీలకం

**జయశంకర్ భూపాలపల్లి :** గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు చాలా ముఖ్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాటారం మండల పరిషత్ కార్యాలయంలో కాటారం డివిజన్ గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసినందున పారిశుధ్య కార్యక్రమాలు చాలా ముఖ్యమని మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో వారంలో రెండు రోజులు తనిఖీలు చేస్తూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది విధులను పర్యవేక్షణ చేయటం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రత్యేక అధికారులు పర్యటనలో గుర్తించిన అంశాలను పరిశీలించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, సబ్ సెంటర్స్, రెసిడెన్సియల్ హాస్టల్స్, గ్రామపంచాయతీ భవనాలు, ప్లాంటేషన్ కంపోస్ట్ షెడ్లు, వైకుంఠధామాలు తనిఖీ చేయాలని, తనిఖీ ఫోటోలను గ్రూపులో పోస్ట్ చేయాలని తెలిపారు. మన గ్రామపంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని అదే మన గోల్ అని తెలిపారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయటం వల్ల గ్రామాలు స్వచ్ఛతను సంతరించుకుని వ్యాధులు దరిచేరని సమాజం ఏర్పడుతుందని అన్నారు. గ్రామాలు స్వచ్ఛతకు జరుగుతున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రహదారులు వెంబటి వ్యర్ధాలు



తొలగించాలని అక్కడ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని అపవాదులు రావొద్దని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమంలో మీరు భాగస్వాములుగా ఉన్నారని, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ అధికారాలను, విధులను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.ఆరుబయట వ్యర్థాలు కాల్చితే చర్యలు తీసుకోవాలని, కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వ్యర్థాలు కాల్చితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం 25 వేల వరకు జరిమానా విధించడానికి అవకాశం ఉందని తెలిపారు. భగీరథ నీటి సరఫరా పర్యవేక్షణ చేయాలన్నారు. మంచినీటి సమస్య ఏర్పడితే తన దృష్టి తీసుకురావాలని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. వేసవిలో చేపట్టిన చర్యల వల్ల గ్రామాల్లో సమస్యలు రాకుండా చేశామని, భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తే తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ యొక్క సమావేశం ముఖ్య విధి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన పేర్కొన్నారు. విధులు అధికారాలు గురించి చట్టం గురించి తెలుసుకోవాలని గ్రామ పంచాయితీలో పర్యటించడం వలన గ్రామాలు స్వచ్ఛతను సంతరించుకుంటాయని పేర్కొన్నారు. ప్రతి వారంలో రెండు లేదా మూడుసార్లు తప్పనిసరిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

శిక్షణ కార్యక్రమంలో విదులు అధికారాలపై సమగ్రమైన, స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. వ్యాపార, మాంసాహార వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.అమ్మపేరున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. వనరుల ద్వారా ఆదాయం సమకూరే లా ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు.అనంతరం గ్రామ పంచాయతి కార్మికులను శాలువాతో సత్కరించి సేవలను అభినందించారు.అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.